
మన్యంలో మరో మేఘాలకొండ



మన్యంలో మరో మేఘాల కొండ చూపరులను కనువిందు చేస్తోంది. డుంబ్రిగుడ మండలం అరుకు పంచాయతీ కేంద్రానికి సమీపంలోని జైపూర్ కూడలి మీదుగా అటవీ ప్రాంతంలో కృష్ణుడి గుడి కొండల్లో నీలి మేఘాల నడుమ పాలసంద్రంలా మంచు పరచుకుని ఆహ్లాదం పంచుతోంది. అరుకు పంచాయతీ కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఈ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. **- డుంబ్రిగుడ, న్యూస్‌టుడే**

నేడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాక



విశాఖపట్నం, న్యూస్‌టుడే: జనసేన అధినేత, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం 9.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, ఇక్కడి నుంచి 9.35 గంటలకు రోడ్డు మార్గంలో విజయనగరం జిల్లా గుర్ల గ్రామానికి బయలుదేరి వెళతారు. అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి సాయంత్రం 4.10గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడి నుంచి 4.15గంటల విమానంలో విజయవాడ బయలుదేరి వెళతారు.

సమాజ రక్షకుడా.. సెల్యూట్

నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం

పాడేరు, న్యూస్‌టుడే: సమాజంలో శాంతి భద్రతలు కాపాడటమే పోలీసుల లక్ష్యం. ఎండావాన, చలీవేడి, రాత్రి పగలు తేడా లేకుండా విధులు నిర్వహిస్తుంటారు. 24 గంటలూ ప్రజలకు అండగా ఉంటారు. విధి నిర్వహణలోనే కొందరు తమ ప్రాణాలు కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో పలువురు పోలీసులు తమ ప్రాణాలు కోల్పోయారు. సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం. ఈ కార్యక్రమాన్ని పాడేరులోని తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించేందుకు ఎస్పీ అమిత్ బర్దార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది. మార్చ్‌ఫాస్ట్‌కు పోలీసులు శిక్షణ పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ దినేష్ కుమార్ హాజరుకానున్నారు. పోలీసు అమర వీరుల కుటుంబాలు పాల్గొననున్నాయి. ముందుగా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు. జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పోలీసు కార్యాలయ వర్గాలు తెలిపాయి.



తలారిసింగి ప్రభుత్వ ఆశ్రమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో అమరుల స్తూపం

సాగునీటి సంఘాలకు నవ వసంతం



గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పూడికలతో నిండిపోయిన ఓ ప్రాజెక్టు కాలువ

వైకాపా హయాంలో నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైన సాగునీటి సంఘాలకు కూటమి ప్రభుత్వం ఊపిరిపోస్తోంది. జలవనరుల బాగోగులను చూసుకునే నీటి సంఘాలను మరలా క్రియాశీలకంగా మార్చబోతుంది. తొమ్మిదేళ్ల తరవాత ఈ సంఘాల ఎన్నికలను నిర్వహించబోతున్నారు. వచ్చేనెల 21 నుంచి 27 వరకు జరగనున్న ఈ సమరానికి సంబంధించి మూడు జిల్లాల కలెక్టర్లు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టుల పరిధిలో 360 సాగునీటి సంఘాలు, నాలుగు ప్రాజెక్టు కమిటీలు, మూడు పంపిణీ కాలువలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సోమవారం నుంచి 40 రోజులపాటు ఈ సాగునీటి ఎన్నికల ప్రక్రియ కొనసాగనుండడంతో పల్లెల్లో సందడి వాతావరణం కనిపించనుంది.

తొమ్మిదేళ్ల తరవాత ఎన్నికలు
నేడు నోటిఫికేషన్ విడుదల

ఈనాడు, పాడేరు

పంట కాలువల అభివృద్ధి, నీటి సరఫరా తీరుతెన్నులు పర్యవేక్షించడంతోపాటు ఆయకట్టు పరిధిలో ఏ సమస్య వచ్చినా సాగునీటి సంఘాలే బాధ్యతాయుతంగా వ్యవహరించేవి. తెదేపా ప్రభుత్వ హయాంలో 2015లో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. నీరు-చెట్టు, ఇతర నిధులతో సాగునీటి వనరులు అభివృద్ధి చేసుకున్నారు. వీరి పదవీకాలం పూర్తయిన తర్వాత వైకాపా సర్కారు మరి ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో సాగునీటి వనరుల నిర్వహణ గాడి తప్పింది. పంట కాలువన్నీ పూడికలతో నిండిపోయి దయనీయంగా మారాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొద్దినెలల్లోనే నీటి సంఘాల ప్రాధాన్యం గుర్తించి మరలా ఎన్నికలు నిర్వహిస్తోంది.

- **తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ ప్రాజెక్టు కమిటీలకు వేరుగా ఎన్నికలు నిర్వహిస్తారు.**
- **విశాఖపట్నం జిల్లా పరిధిలో 29 మైనర్ నీటి సంఘాల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి.**
- **అల్లూరి జిల్లాలో కూడా 28 మైనర్ నీటి సంఘాలు ఉన్నాయి.**

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- షెడ్యూల్ సోమవారం విడుదల చేస్తారు. ఎన్నికల నిర్వహణకు కలెక్టర్లు అధీకృత అధికారులను నియమిస్తారు.
- ఈనెల 22 నుంచి 31 లోగా సాగునీటి సంఘాల పరిధిలో ఓటర్ల వివరాలన్ని సేకరిస్తారు. 31న ఆయా సంఘాల పరిధిలో వాటిని ప్రదర్శిస్తారు.
- మేజర్, మీడియం, మైనర్ సంఘాల వారీగా వేర్వేరు తేదీల్లో ఈ జాబితాల ప్రదర్శన ఉంటుంది.
- నవంబర్ 21న నీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యుయూఏ) సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.
- నవంబర్ 24న పంపిణీ కాలువ (డిస్ట్రిబ్యూటరీ కెనాల్) పరిధిలో ఎన్నికలు చేపడతారు.
- నవంబర్ 27న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

నియోజకవర్గాల వారీగా సంఘాలు

నియోజకవర్గం	మైనర్	మీడియం	మేజర్
నర్సీపట్నం	38	–	13
పాయకరావుపేట	48	–	3
అనకాపల్లి	23	–	–
ఎలమంచిలి	39	–	–
చోడవరం	53	7	–
మాడుగుల	33	21	–
పెందుర్తి	25	–	–

ఎన్నికల ప్రక్రియ ఇలా..

- మైనర్ నీటి సంఘాలల్లో ఆరుగురు సభ్యులను ఎన్నుకుంటారు. వారిలో ఒకరు అధ్యక్షులు, మరొకరు ఉపాధ్యక్షులుగా ఉంటారు.
- మీడియం, మేజర్ నీటి సంఘాల్లో 12 మంది సభ్యులను ఎన్నుకుంటారు. వారిలో ఒకరు అధ్యక్ష, మరొకర్ని కార్యదర్శులుగా అదే రోజు ఎన్నుకుంటారు.
- సాగునీటి సంఘాల్లో ఓటర్లు చేతులు పైకెత్తి ఆమోదం తెలపడం ద్వారా సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలుంటాయి. ఎక్కడైనా ఈ విధానంపై అభ్యంతరముంటే చీటిలపై పేర్లు రాసి ఇమ్మని కోరతారు.

గోదారి పిలుస్తోంది!

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే

పచ్చని తివాచీలు పరిచినట్టు
దర్శనమిచ్చే ఎత్తయిన కొండలు..
విశాలంగా కనిపించే గోదారి గట్లు..
మధ్యలో బిరబిర పరుగులు
తీసే గోదారమ్మ హొయలు..
నది మధ్యలో బండరాళ్లపైన పక్షుల సందడి..
గంగపుత్రుల చేపలవేట..
అక్కడక్కడా చిన్నచిన్న పడవలపైన కొండరెడ్ల ప్రయాణాలు, అప్పుడప్పుడూ దర్శనమిచ్చే పెద్దపెద్ద తాబేళ్లు..
ఇలా చెప్పుకొంటూ పోతే పాపికొండల పర్యటనకు వెళ్తే కనిపించే ప్రకృతి అందాలెన్నో..
మనసును మురిపించే సన్నివేశాలెన్నో.



పాపికొండల వద్ద గోదావరి నదిలో పర్యాటకుల బోటు



పేరంటాలపల్లి శివాలయం ఎదుట కొండవాగులో పర్యాటకులు

వరదల సమయంలో గోదావరి ఎంత ఉగ్రరూపంతో ఉంటుందో మిగిలిన సమయంలో అంత ప్రశాంతంగా ఉంటుంది. ఎన్నో ఉపనదులను తనలో కలుపుకొని ఎంతో విశాలంగా కనిపించే నది పాపికొండల నడుమ చిన్న వాగులాగా ఒదిగిపోయి కనిపిస్తుంది. దాదాపు మూడు నెలలుగా గోదావరి వరదల కారణంగా ఈ సుందరమైన పాపికొండల పర్యాటకం నిలిచిపోయింది. ప్రకృతి అందాలను ఆస్వాదించాలని ఎక్కడెక్కడి నుంచో వస్తున్న వారంతా తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఎట్టకేలకు వరద ఉద్ధృతి తగ్గుముఖం పట్టి గోదావరి శాంతించడంతో పాపికొండలకు మళ్లీ బోట్లు బయలుదేరాయి.

- పర్యాటకులకు వరరామచంద్రాపురం మండలంలోని పోచవరం రేవు నుంచి 21 బోట్లు, దేవీపట్నం మండలం పోశమ్మగండి రేవులో 12 బోట్లు అందుబాటులో ఉంటాయి. అటు ఆన్‌లైన్‌లో, ఇటు రాజమహేంద్రవరం, భద్రాచలం పట్టణాల్లో టిక్కెట్లు విక్రయిస్తుంటారు. 40 వరకు బోటు యాజమాన్యం, సిబ్బందికి ప్రత్యక్షంగా కల్పించే పాపికొండల పర్యాటకం పరోక్షంగా వందల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోంది. ఆటోలు, కార్లు, బస్సులు, హోటళ్లు, లాడ్జిలు, తినుబండారులు అమ్ముకునే చిరువ్యాపారులు, పేరంటాలపల్లిలో వెదురు అల్లికలు విక్రయించే కొండరెడ్లు.. ఇలా ఎంతోమందికి పర్యాటకమే జీవనోపాధి. దసరా, దీపావళి సెలవుల కారణంగా పెద్దసంఖ్యలో సందర్శకులు వస్తుండటం అందరికీ కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తోంది. దేవీపట్నం మండలం గండిపోశమ్మ రేవు నుంచి పర్యాటక యాత్ర మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది.
- పోచవరం రేవు నుంచి ఆదివారం 301 మంది పర్యాటకులు ఐదు బోట్లలో పాపికొండల్లో విహరించారని కంట్రోల్ మేనేజర్ రాజేశ్ తెలిపారు. పేరంటాలపల్లి శివాలయాన్ని సందర్శించి, జలపాతంలో సేద తీరి.. పాపికొండల యాత్రకు వెళ్లారు.



మహిళలు విక్రయిస్తున్న కళాకృతులు

హెచ్చరిక.. ఉత్తుత్తిదేనా?

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏర్పాటు చేసిన బోర్డులు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. అరకులోయ తహసీల్దారు కార్యాలయం ప్రహరీ వద్ద ఖాళీ స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే అక్కడే కొంతమంది మట్టిని నింపే ఏర్పాట్లు చేస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. తహసీల్దారు కార్యాలయం వద్దే ఈ పరిస్థితి ఉంటే మిగిలిన ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. **– అరకులోయ, న్యూస్‌టుడే**



తహసీల్దార్ కార్యాలయం ప్రహరీకి అతికించిన ఫ్లెక్సీ

బాహుబలి సాలీడు



సహజంగా సాలి పురుగును ఒక సెంటీమీటరు పరిమాణంలో చూస్తుంటాం. కూనవరం మండలం కూళ్లపాడు, రామచంద్రాపురం మధ్య అడవుల్లో ఓ బాహుబలి లాంటి సాలి పురుగు అధికారుల కంటపడింది. ఇది సుమారు ఆరు నుంచి ఎనిమిది సెంటీమీటర్లు ఉండి, బంగారు వర్ణంతో ధగధగలాడుతోంది. చాలా అరుదుగా కనిపించే దీనిని 'మహా చెక్క సాలీడు', 'బంగారు నేత సాలీడు'గా పిలుస్తారని ఎఫ్‌ఆర్వో ఎం.కరుణాకర్ తెలిపారు. ఇది గూడు కోసం అల్లే దారాన్ని బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లో వాడతారన్నారు. అంతరిక్షంలోకి తీసుకెళ్లే దారాలుగా కూడా దీనిని వినియోగిస్తారని పేర్కొన్నారు. ఇటీవల అడవుల్లో పులి సంచారంపై అన్వేషణ చేస్తున్న క్రమంలో ఇది తారసపడినట్లు చెప్పారు. **– కూనవరం, న్యూస్‌టుడే**

కూలిన వంతెన.. తప్పిన ప్రమాదం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: జోలాపుట్టు పంచాయతీలోని లబ్బూరు నుంచి బరడ వెళ్లే రహదారిలో డైనిజోల వద్ద వంతెన ఆదివారం కూలిపోయింది. లక్ష్మీపురం పంచాయతీలోని బిరిగుడ గ్రామ సమీపంలో వంతెన నిర్మాణానికి ఇసుక తరలిస్తున్న టిప్పర్ వంతెనపై నుంచి వెళ్తుండగా కుంగిపోయింది. లారీ ముందు చక్రాలు వంతెన దాటి.. వెనుక చక్రాలు దాటేలోగా బ్రిడ్జి కుంగి లారీ నిలిచిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. బరడ, లక్ష్మీపురం, బుంగాపుట్టు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



కూలిన వంతెన వద్ద చిక్కుకున్న ఇసుక టిప్పర్

26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఈనెల 26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలకు చెందిన తెదేపా శ్రేణులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న చింతూరులో ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాదర్బార్ ముగిసిన తర్వాత చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, ఎటపాక మండలాలకు చెందిన తెదేపా శ్రేణులతో సభ్యత్వ నమోదుపై సమావేశం ఉంటుందన్నారు.

ప్రాణ సంకటంగా ప్రయాణాలు

ఏలేశ్వరం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే


రహదారులపై ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. రోజూ ప్రాణ సంకటంగా ఉన్నా ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. జిల్లాలో ముఖ్య రహదారుల పునః నిర్మాణంలో గత వైకాపా ప్రభుత్వ నిర్లిప్త ధోరణి ప్రయాణికులకు శాపంగా మారింది. ఏలేశ్వరం, శంఖవరం మండల పరిధిలోని ఈ రెండు రహదారుల దుస్థితితో 75 వేల మందికి అవస్థలు తప్పడంలేదు. నిధులు ఉన్నా పనులు చేయించడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. కనీస మరమ్మతులు లేక రోజూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారుల ప్రస్తుత స్థితి వైకాపా సర్కారు అస్తవ్యస్త పాలనకు అద్దం పడుతోంది.

అధ్వానంగా అనుసంధాన రోడ్డు



తూర్పులక్ష్మీపురం వద్ద అడుగుకో గుంతలతో రహదారి

ఏలేశ్వరం మండలం జె.అన్నవరం- రమణయ్యపేట వరకు 13 కి.మీ. ర.భ.శాఖ రహదారి ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ జిల్లాలకు చెందిన వేల మంది ప్రయాణికులకు ఈ రోడ్డే శరణ్యం. అడుగుకో గుంతతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. పెద్ద పెద్ద గుంతల్లో బస్సులు, వ్యాన్లు, భారీ వాహనాలు దిగబడిపోతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులైతే గాయపడుతున్నారు. ఐదేళ్ల కిందట రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు విడుదలయ్యాయి. అరవై నెలల కాలంలో గుత్తేదారు కేవలం రోడ్డుకు ఇరువైపులా అంచులను తవ్వి పటిష్టం చేశారు. తాగునీటి పైపులైనును దూరంగా తరలించారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు ఇటువైపు రాలేదు. వర్షాలకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. మండల కేంద్రం ఏలేశ్వరం రావాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని తూర్పులక్ష్మీపురం, రమణయ్యపేట, జె.అన్నవరం గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కనీసం ద్విచక్ర వాహనం వెళ్లేందుకు వీలులేని రీతిలో రహదారి దుర్భరంగా ఉంది.



రమణయ్యపేట వద్ద రహదారి దుస్థితి

మధ్యల్లో వదిలేశారు.. శంఖవరం మండలం పెదమల్లాపురం రహదారి గిరిజనానికి నిత్యావసరం. జి.కొత్తపల్లి, గౌరంపేట, శృంగధార, వేళంగి తదితర 15 గ్రామాల్లో నివసిస్తున్న 20 వేల మంది జనాభా పెద మల్లాపురం రోడ్డు దుస్థితితో అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి రూ. 6 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పుష్కర కాలం కిందట సగం రహదారిని నిర్మించారు. బిల్లులు మంజూరు కావనే భయంతో అప్పట్లో గుత్తేదారు పనులను నిలిపేశారు. మిగిలిన నిధులు ఏమైపోయాయో జాడే లేదు.

ఇబ్బందులు తీరుస్తాం.. రహదారులను క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలిస్తాం. రోడ్లను చక్కదిద్దాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గతంలో ఏమేరకు నిధులు విడుదలయ్యాయి, వ్యయం ఎంత తదితర వివరాలను కూలంకషంగా పరిశీలిస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పెద్దాపురం డివిజన్ పరిధిలోని రహదారులను చక్కదిద్దుతాం. సత్వరం పనులు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. **– రాఘవ, డీఈఈ, పెద్దాపురం**

విద్యార్థుల సమస్యలపై ఆరా



అనంతగిరిలో బాలికల పాఠశాల-2ను పరిశీలిస్తున్న జడ్జి స్వర్ణ

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలబాలికల పాఠశాలలను అరకులోయ కోర్టు ఇన్‌ఛార్జి, చోడవరం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ ఆదివారం సందర్శించారు. బొర్రా, అనంతగిరి బాలికల-1, అనంతగిరి బాలికల-2, కొత్తవలస బాలుర పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వసతి గదులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సదుపాయాలు, భోజనాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అధికారులు పాల్గొన్నారు.

దారికాసిన ప్రమాదాలు

అనకాపల్లి-విశాఖ జాతీయ రహదారిలో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరిగింది. ఈ ఘటనలను పరిశీలిస్తుంటే మానవ తప్పిదాలు, రహదారి నిర్వహణ లోపాలు, వాహనదారుల నిర్లక్ష్యం వంటివి కనిపిస్తున్నాయి.



డొంకాడ వద్ద విరిగిన దీపపు స్తంభాన్ని వైర్లతో కట్టారిలా..



అగనంపూడి సమీపంలో డివైడర్‌ను దాటుతున్న వాహన చోదకులు

అగనంపూడి సమీపంలో జాతీయ రహదారిలో డొంకాడ వద్ద విరిగి ప్రమాద భరితంగా ఉన్న దీపపు స్తంభాన్ని అలానే వదిలేశారు. దీన్ని వైర్ల సాయంతో కట్టారు. అయితే ఇది తాత్కాలికమే. లంకెలపాలెం వద్ద విరిగిన ఇనుప గ్రిల్సు ప్రమాదభరితంగా ఉన్నాయి. అగనంపూడి సమీపంలో రద్దీగా ఉండే దారిలో డివైడర్‌ను ద్విచక్ర వాహనదారులు ప్రమాదభరిత స్థితిలో దాటేస్తున్నారు. రహదారి భద్రత విషయంలో ఎప్పటికప్పుడు అందరూ అప్రమత్తంగా ఉండాల్సిందే.

– ఈనాడు, విశాఖపట్నం



లంకెలపాలెం వద్ద విరిగిన ఇనుప గ్రిల్స్

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: మహిళా అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి కృషి చేస్తోందని ఆ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ పారె లక్ష్మి పేర్కొన్నారు. శారదానగర్‌లో ఆదివారం జరిగిన సంఘ జిల్లా స్థాయి సమావేశంలో కో ఛైర్‌పర్సన్ విద్యతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధులు కేటాయించే సమయంలో ఏ సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. సమయం, ప్రాంతాలకు అనుగుణంగా వీరి రక్షణను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కొన్ని శాఖలు, విభాగాల్లో మహిళల ఇబ్బందులను అధికారులు గుర్తించాలని కోరారు. కార్యాలయాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో సిబ్బందికి సెలవులతో సంబంధం లేకుండా విధులు కేటాయిస్తున్నారని, వీరికి వార్షిక వ్యక్తిగత సెలవులను 35 నుంచి 40కి పెంచాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు.



ఎన్నికైన డివిజన్ కమిటీలతో రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

మహిళా ఉద్యోగుల విభాగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామన్నారు. ఇందుకు ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ఒకటో తేదీన జీతాలు అందించడం హర్షణీయమన్నారు. జిల్లా ఛైర్మన్ ఎస్.ఎస్.వి.ఎస్. నాయుడు, కార్యదర్శి డి.లోకరాజు, కోశాధికారి యలమంచిలి శ్రీరామమూర్తి, మహిళా విభాగం జిల్లా ఛైర్‌పర్సన్ వీరవాణి, కార్యదర్శి లక్ష్మి, ఏపీసీపీఎస్ జిల్లా కార్యదర్శి బోయిన చిన్నారావు, వీఆర్వోల సంఘం డివిజన్ అధ్యక్షుడు గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కమిటీల ఎన్నిక

మహిళా విభాగం అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల ఎన్నికలు జరిగాయి. అనకాపల్లి డివిజన్ ఛైర్‌పర్సన్‌గా వి.రాజ్యలక్ష్మి, కార్యదర్శిగా ఓఆర్ కళతో పాటు కార్యవర్గ పదవుల్లోకి జీవీఎల్ఎన్ ఈశ్వరి, జి.ఝాన్సీ, ఇందు, కె.జ్యోతిలను ఎన్నుకున్నారు. నర్సీపట్నం డివిజన్ ఛైర్‌పర్సన్‌గా హెచ్.త్రివేణి, కార్యదర్శిగా కె.నాగమణిలతోపాటు కార్యవర్గ పదవుల్లోకి ఎన్ఎన్ రత్నం, టి.దేవకాంతం, జీఆర్ఎస్ఎన్ రత్నం, కేవీఎన్ఎల్‌జీ కుమార్, ఎం.అమరావతిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం వీరు ప్రమాణ స్వీకారం చేశారు.

అనిత నివాసంలో లక్ష్మీనరసింహ యాగం

నక్కపల్లి, న్యూస్‌టుడే: సారిపల్లిపాలెంలోని తన నివాసంలో మంత్రి వంగలపూడి అనిత ఆదివారం రాజశ్యామల సహిత లక్ష్మీ నరసింహ యాగాన్ని నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి ఆమెను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ క్రతువు తలపెట్టినట్లు వెల్లడించారు. కొప్పిశెట్టి వెంకటేష్, కొప్పిశెట్టి బుజ్జి, గోసల శ్రీకాంత్, పెదిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.



యాగంలో పాల్గొన్న మంత్రి అనిత

మజ్జిగైరమ్మ సన్నిధిలో ఆత్మీయ సమావేశం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: వారంతా రెండు గ్రామాలకు చెందిన వారు. దశాబ్దాల కిందట జీవనం కోసం విశాఖ నగరానికి వచ్చి స్థిరపడ్డారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం, అందాలపల్లి గ్రామాలకు చెందిన వారంతా చోడవరం మండలం అడ్డూరులోని మజ్జిగైరమ్మ ఆలయంలో ఆదివారం ఆత్మీయ సమావేశమయ్యారు. స్వగ్రామ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెండు గ్రామాలకు చెందిన వారు కుటుంబాలతో హాజరయ్యారు. కష్టసుఖాలను పంచుకుంటూ కుటుంబాల స్థితిగతులను తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేసి వనభోజనాలు చేశారు.



సమావేశమైన రెండు గ్రామాల ప్రజలు


23న ఏయూ పాలకవర్గ సమావేశం!

ఈనాడు, విశాఖపట్నం

ఆంధ్ర విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక మండలి (ఈసీ) లేదా పాలకవర్గ సమావేశం ఈనెల 23న నిర్వహించే అవకాశముంది. దీనికి సంబంధించిన అజెండాను ఏయూ అధికారులు ఇప్పటికే ఉన్నత విద్యాశాఖకు పంపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈసీ సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి. ఇందులో విద్యా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు తదితరాలపై చర్చించనున్నారు. సమావేశానికి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వర్చువల్‌గా హాజరయ్యే అవకాశముంది.

పలు కీలక నిర్ణయాల అమలుపై చర్చ

ప్రస్తుత ఈసీకి ఇదే చివరి భేటీ..!



కంప్యూటరీకరణకు..: 'సమర్థ్' ప్రాజెక్టులో భాగంగా వర్సిటీలో అన్ని కార్యకలాపాలను డిజిటలైజ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఉద్యోగుల సర్వీసు, ఉద్యోగులు, విద్యార్థుల హాజరు, పరీక్షలు, పరీక్షా పత్రాల మూల్యాంకనం, ఫీజులు తదితర వివరాలను కంప్యూటరీకరణ (డిజిటలైజేషన్) చేయనున్నారు. ఈ ప్రక్రియను అమలుచేయడానికి తీర్మానం చేయనున్నారు.

ప్రయోగశాలల ఏర్పాటుకు: ఎలిమెంట్ భవనంలో ఫార్మా, ఆహార పరీక్షల ప్రయోగశాలలు, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. వీలుగా ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకోనున్నారు. దీనికి అవసరమైన యంత్ర సామగ్రిని ఇప్పటికే తెప్పించారు. వాటి ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు

త్వరలో ఈసీ రద్దు..: ప్రస్తుతం ఏయూలో గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గమే కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో పాలకవర్గాలను రద్దు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. వాటి స్థానంలో బోర్డు ఆఫ్ గవర్నన్స్ (గవర్నింగ్ బాడీ)ని నియమించడంపై సమాలోచనలు జరుగుతున్నాయి. గవర్నింగ్ బాడీ ఏర్పాటయ్యేందుకు కనీసం ఆరు నెలలు పడుతుందని విద్యావేత్తలు చెబుతున్నారు. ఈలోగా ప్రస్తుత ఈసీని రద్దు చేసి.. కొత్త పాలకవర్గాన్ని నియమించే అవకాశం లేకపోలేదు.

నామినీ ఎంపిక ప్రధానం: వీసీ నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీలో యూజీసీ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున నామినీలను ఎంపిక చేశారు. వర్సిటీ తరఫున ఈసీ నామినీ పేరును ఈనెల 25లోపు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈసీ సమావేశంలో ప్రధానంగా దీనిపై చర్చించనున్నారు.

ప్రొఫెసర్ల నియామకంపై..: మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఇంజినీరింగ్‌లో ఈసీఈ, సీఎస్ఈ, ఐటీ విభాగాల్లో అధ్యాపకుల కొరత ఎక్కువగా ఉంది. ఆయా విభాగాల్లో నిబంధనలకు అనుగుణంగా తాత్కాలిక ప్రాతిపదికన ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీసు (పీఓపీ), అడ్జంక్ట్ ప్రొఫెసర్లను నియమించేందుకు అనుమతులు తీసుకోనున్నారు.

రెండు డిగ్రీల విధానంపై..: వర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లోనూ రెండు డిగ్రీల విధానం తీసుకురానున్నారు. కొత్తగా వీఎల్ఎస్ఐ కోర్సును ప్రారంభించనున్నారు. వాటి అమలు, అవసరమైన పాఠ్యప్రణాళిక రూపొందించేందుకు అనుమతులు తీసుకోనున్నారు.

కంప్యూటర్ల కొనుగోలుకు..: విద్యార్థుల అవసరాల నిమిత్తం 500 'థిన్ క్లైంట్ సర్వర్ బేస్డ్' కంప్యూటర్లను కొనుగోలు చేయనున్నారు. దీనిపై ఈ-టెండర్‌కు వెళ్లనున్నారు. దీని ద్వారా ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు వీలవుతుంది. అవసరమైతే ప్రభుత్వ నియామకాలకు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలకు కూడా వినియోగించుకోవచ్చు. దీనిపై సమావేశంలో చర్చించనున్నారు.

సుజల స్రవంతి పూర్తి చేస్తాం

కశింకోట, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేసి రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలను పురస్కరించుకొని కశింకోట మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. వైకాపా నాయకులు భూసర్వే పేరుతో పేదల భూములను కాజేశారని ఆరోపించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. కన్నూరుపాలెం, సుందరయ్యపేట, తీడ, చరకాం, గ్రామాలలో సీసీ రోడ్లు, అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఏడాదిలోపే పూర్తి చేస్తామన్నారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, నాయకులు కాయల మురళీధర్, గొంతిన శ్రీనివాసరావు, కర్రి వెంకట సత్యనారాయణ, పొన్నగంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యేలు కొణతాల, రాజు తదితరులు

సీఎం సహాయ నిధికి తపాలా ఉద్యోగుల విరాళం

వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఎంప్లాయిస్ సహకార పరపతి సంఘం రూ.లక్ష విరాళం అందజేసింది. పల్లె-పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కన్నూరుపాలెం వచ్చిన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, కేఎస్ఎన్ఎస్. రాజు, పీలా గోవింద సత్యనారాయణలకు చెక్కును సంఘ అధ్యక్షులు బి.నూకరాజు, కార్యదర్శి వీరభద్రం, ఉపాధ్యక్షులు కె.సింహాచలం, కిరణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు.

మహిళ మృతిపై దర్యాప్తు ముమ్మరం

అడ్డతీగల, న్యూస్‌టుడే: తిమ్మాపురం గ్రామ శివారు ఏలేరు కాలువలో ఈ ఏడాది ఆగస్టు 17న తల, చేతులు, కాళ్లు వేరుచేసి ఉన్న గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. దీనిపై అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతి చెందిన మహిళ ఊహా చిత్రాన్ని గుజరాత్ నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీలో వేయించినట్లు సీఐ నరసింహమూర్తి ఆదివారం ప్రకటనలో తెలిపారు. మహిళ వివరాలు తెలిస్తే వెంటనే 94409 00768 నంబరుకు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



మహిళ ఊహాచిత్రం

'విశాఖ డెయిరీలో ఉద్యోగులపై వివక్ష'

విశాఖపట్నం, న్యూస్‌టుడే : విశాఖ డెయిరీ యాజమాన్యం ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ విమర్శించారు. దివంగత తులసీరావు ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగుల పిల్లల పేరిట చేసిన డిపాజిట్ మొత్తం సుమారు రూ.25కోట్లు ప్రస్తుత ఛైర్మన్ ఆడారి ఆనంద్ కాజేశారని ఆరోపించారు. విశాఖ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఛైర్మన్ బంధువైన ఉద్యోగినికి రూ.లక్ష వేతనం చెల్లిస్తున్నారని, అంతేకాకుండా ఒకేసారి రూ.30వేలు పెంచారన్నారు. ఆమె కంటే పెద్ద చదువులు చదువుకొని, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారికి రూ.30వేలకు మించి ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో తాను చేసిన ఖర్చు మొత్తం సర్దుబాటు చేసేందుకు సుమారు రూ.30కోట్ల మేర లెక్కల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఛైర్మన్ భార్య పేరిట డెయిరీ నడుపుతూ నిత్యం విశాఖ నుంచి 25వేల లీటర్ల పాలను అక్కడికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఛైర్మన్ ఇంటికి నెలకు రూ.2లక్షల అద్దె డెయిరీ చెల్లిస్తోందన్నారు. విశాఖ డెయిరీలో ఛైర్మన్ కుటుంబం దోపిడీని ఆధారాల సహా ఇటీవల మంత్రి నారా లోకేశ్‌కి అందించానని, త్వరితగతిన విచారణ జరిపి డెయిరీని కాపాడాలని కోరినట్లు తెలిపారు.



విశాఖ డెయిరీ ఉద్యోగుల జీతాల వివరాలు చూపుతున్న మూర్తియాదవ్

ఐటీ పరిశ్రమలకు ఆర్టీసీ బస్సులు

మధురవాడ, న్యూస్‌టుడే: రుషికొండ ఐటీ హిల్స్‌లోని వివిధ పరిశ్రమల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్.ఎం. బి.అప్పలనాయుడు అన్నారు. మధురవాడలోని ఆర్టీసీ డిపోను ఆదివారం ఆయన సందర్శించారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు రాజీలేని పోరాటం

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆధీనంలో విద్యా సంస్థలు ఉంటేనే సమాజంలో నైతిక విలువలు, ప్రజాతంత్ర హక్కులను నిలబెట్టుకోగలమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్.నాగమణి ఆవిష్కరించారు. అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. పాలకవర్గాల విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలహీన పడిందన్నారు. ఈ వ్యవస్థను బతికించుకోవడానికి బడి సమయం కంటే అదనంగా ఒక గంట ఉపాధ్యాయులు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహన్‌రావు, ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేద్కర్, నాయకులు పైడిరాజు, ఎన్.ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు చుక్క సత్యం, ఉప్పాడ రాము, మహ్మద్ రిజ్వాన్, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

పదోన్నతులు కల్పించాలని వినతి

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు ఎ.సుందర్, ప్రధాన కార్యదర్శి కేఆర్‌పి కుమార్ కోరారు. స్థానిక ఐటీడీఏలో గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయశాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. పదోన్నతుల కోసం సీనియారిటీ తుది జాబితాను తయారు చేయాలని కోరారు. సంఘ నాయకులు బి.ఎస్ కుమార్, మల్లమ్మ, తులసీదాసు, రామారావు తదితరులు ఉన్నారు.



డీడీకి వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

హిమం.. మురిపెం!

పాడేరు/పట్టణం, న్యూస్‌టుడే: మన్యంలో మంచు సోయగాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా గత మూడు రోజుల నుంచి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం దట్టమైన పొగమంచు కురుస్తోంది. మధ్యాహ్నం ఎండ కాస్తూ, చిరుజల్లులు కురుస్తున్నాయి. పాడేరు శివారులోని పచ్చని కొండల నడుమ మేఘాలు ఆకట్టుకుంటున్నాయి. పాడేరు ఘాట్‌రోడ్డులో పొగమంచు కమ్ముకుని రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంజంగి మేఘాలకొండకు పర్యాటకులు తరలివచ్చారు.



పాడేరు ఘాట్‌రోడ్డులో..



పాడేరు శివారు ప్రాంతాల్లోని కొండల్లో మేఘాలు

చింతపల్లి, అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: పర్యాటకుల రాకతో చింతపల్లి మండలంలోని లంబసింగి, చెరువులవెనం, తాజంగి, ఎర్రవరం జలపాతాల వద్ద సందడి నెలకొంది. శని, ఆదివారాల్లో ఇక్కడ మంచు అందాలను ఆస్వాదించేందుకు దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కుటుంబాలతో సహా తరలివచ్చారు. ముసురు వాతావరణంతో గత మూడు రోజులుగా అరకులోయ పరిసరాల్లో మంచు ప్రభావం తగ్గింది. ఆదివారం పొగమంచు కనిపించింది. మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్‌కు తెల్లవారుజాము నుంచి పెద్దసంఖ్యలో సందర్శకులు చేరుకున్నారు. మేఘాల నడుమ సూర్యోదయాన్ని తిలకించారు. ఈ అందాలను కెమెరాల్లో బంధించారు. థింసా నృత్యాలతో సందడి చేశారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం నుంచి మారేడుమిల్లి వెళ్లే ప్రధాన రహదారిలో కొండలపై ఆదివారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్ముకొంది. పర్యాటకులు ఈ అందాలను ఆస్వాదించారు. స్థానిక గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల వద్ద ఉన్న కొండలపై ఉదయం 7 గంటలు దాటినా పొగమంచు వీడలేదు.



చెరువులవెనంలో మంచు అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు



అరకులోయ మాడగడ వ్యూ పాయింట్ వద్ద..



రంపచోడవరం గురుకుల పాఠశాల ఆవరణలో..

హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యతని ఆదివాసీ అర్చక సంఘం మండల అధ్యక్షుడు కొర్ర బలరాం అన్నారు. దానధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం దేవరాపల్లి పంచాయతీ రామగెడ్డ గ్రామంలో ఆలయాలకు ధూపదీప పూజా సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో కార్తిక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ట్రస్ట్ సేవా ప్రతినిధి కంకిపాటి గిరిబాబు, ఆదివాసీ అర్చక సంఘం ఉపాధ్యక్షులు జర్త రాజారావు, మండల కార్యదర్శి గబులంగి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



ఆలయాలకు ధూపదీప సామగ్రి అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

రోడ్డు నిర్మించాలని వినతి

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరి- దేవరాపల్లి మండలాలను కలుపుతూ శారదా నదిపై వంతెన నిర్మించి అప్రోచ్ రోడ్డు వేయాలని తెదేపా నాయకులు సురేష్ కోరారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తికి దేవరాపల్లిలో వినతిపత్రం అందించినట్లు చెప్పారు.

ఉత్సాహంగా పల్లె పండగ

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: కిముడుపల్లి పంచాయతీ గడుగుపల్లిలో సర్పంచి శోభారాణి ఆధ్వర్యంలో ఆదివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రూ.2.30 లక్షలతో మినీ గోకులం షెడ్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అభివృద్ధి పనుల్లో నాయకులు, ప్రజలు భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. వార్డు సభ్యులు వంతాల బాలన్న, మర్రి దాసన్న, మామిడి కృష్ణారావు, కూటమి నాయకులు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలో రూ 1.10 కోట్ల విలువైన 33 పనులకు శంకుస్థాపన జరిగినట్లు ఏపీవో సురేష్‌కుమార్ తెలిపారు. అమినాబాద్, వాతంగి, లోదొడ్డి పంచాయతీల్లో సర్పంచులు వెంకటలక్ష్మి, సుబ్బలక్ష్మి, రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

గంగవరం, న్యూస్‌టుడే: మొల్లేరులో పలు అభివృద్ధి పనులను సర్పంచి కుంజం లక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు. వైస్ ఎంపీపీ రామ తులసి, తెదేపా మండల అధ్యక్షుడు పాము అర్జున్, ఏపీవో ప్రకాష్, ఈవోపీఆర్డీ నరసింగరావు పాల్గొన్నారు.



గడుగుపల్లిలో భూమిపూజ చేస్తున్న సర్పంచి శోభారాణి, నాయకులు గ్రామస్థులు

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం చావడికోట పంచాయతీ పరిధిలోని బొడ్లంక ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని పేర్కొన్నారు. సర్పంచి సాదల ప్రేమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం మండలంలోని కుసుమరాయి జంక్షన్‌లో ఎస్సై డి.భూషణం ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. దస్త్రాలు పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజేఎఫ్‌వోఏ ఎన్నిక ఏకగ్రీవం

చింతూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ జూనియర్ అటవీ అధికారుల అసోసియేషన్(ఏపీజేఎఫ్‌వోఏ) చింతూరు డివిజన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం చింతూరులో నిర్వహించారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ లెనిన్, కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణ్, రాజమహేంద్రవరం సర్కిల్ ప్రతినిధి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా సాయి వెంకటరమణ, కార్యదర్శిగా భిక్షం, కార్యనిర్వాహక కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా సుధీర్‌లను ఎన్నుకున్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్‌డ్	206	240
స్కిన్‌లెస్	234	250

మార్మోగిన సత్యసాయి నామస్మరణ

పాడేరు/పట్టణం, చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పాడేరు పట్టణం, చింతపల్లిలో సత్యసాయి నామస్మరణ మార్మోగింది. భగవాన్ సత్యసాయి అవతార ప్రకటన వేడుకల్లో భాగంగా ఆదివారం పాడేరులో జిల్లా సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా కమిటీ కన్వీనర్ గణేష్, సుబ్బారావు, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. ● గూడెంకొత్తవీధి మండలం రింతాడ గ్రామం నుంచి చింతపల్లి డిగ్రీ కళాశాల వరకు సమితి సభ్యులు, బాబా భక్తులు ర్యాలీ నిర్వహించారు. సాయి నామస్మరణతో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం కళాశాల వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు.


పాడేరు పట్టణంలో ర్యాలీగా వస్తున్న సత్యసాయి భక్తులు


చింతపల్లిలో..

జోనల్ మీట్‌కు గురుకుల విద్యార్థుల ఎంపిక

దేవరాపల్లి, న్యూస్‌టుడే: సైన్స్ అండ్ ఆర్ట్స్ జోనల్ మీట్‌కి గురుకుల విద్యార్థులు కె.ప్రవీణ్, కె.సుధీర్, జి.సంజయ్ ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పి.రఘు చెప్పారు. ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లిలో ఈ నెల 18న జరిగిన జిల్లా స్థాయి ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌లో వీరు గీసిన చిత్రాలు ద్వితీయ బహుమతికి ఎంపికయ్యాయని చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జి.అర్జునరావును జిల్లా సమన్వయాధికారి రూపావతి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ ఇరటా నరసింహమూర్తి తదితరులు ఆదివారం అభినందించారు.



పంచాయతీ కార్యాలయం పూర్తయ్యేదెప్పుడో!

కొయ్యూరు, న్యూస్‌టుడే: మంప పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఆరేళ్ల క్రితం అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఆ వెంటనే పనులు ప్రారంభమైనా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. భవనానికి కిటికీలు, తలుపులు అమర్చలేదు. విద్యుత్తు సదుపాయం లేదు. కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించి పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముంచంగిపుట్టులో నాలుగేళ్ల నుంచి అసంపూర్తిగా ఉప కేంద్రం

మన్యంలో రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణాలు ఏళ్ల తరబడిగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నిధులు వృథా చేశారే తప్ప నిర్మాణాలు పూర్తి చేయలేదు. పాఠశాల భవనాలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా, ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి

నిర్మాణాలపై నిర్లక్ష్యం..

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టులో నాలుగేళ్ల క్రితం చేపట్టిన ఆరోగ్య ఉప కేంద్రం భవనం నేటికీ పూర్తికాలేదు. 18 గ్రామాల్లో చేపట్టిన గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాల్లో సుజనకోట సచివాలయం మినహా మిగతా 17 గ్రామాల్లో భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. సచివాలయాలకు భవనాలు లేక శిథిలమైన పంచాయతీ భవనాల్లో కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. కించాయిపుట్టు గ్రామ సచివాలయాన్ని జిల్లా పరిషత్తు అతిథిగృహంలో నిర్వహిస్తున్నారు. వనబసింగి, తడ్డాపల్లి, నర్సిపుట్టు, తలాబుతోట గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు ఐదేళ్లుగా పూర్తి కాలేదు. పరాయిపంచన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దారెల, లక్ష్మీపురం పంచాయతీల్లో పాఠశాలల వద్ద విద్యార్థుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు సైతం ఏళ్ల తరబడిగా అసంపూర్తిగా ఉండిపోయాయి. భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.


నిర్మాణం పూర్తికాని పాఠశాల భవనం


మంపలో నిలిచిన భవన నిర్మాణం

గ్యాస్ పైపుల మార్పునకు చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారుల ఆదేశాల మేరకు గ్యాస్ పైపులు మారుస్తున్నట్లు ఏజెన్సీ మేనేజర్ శ్రీనివాసకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లు పైబడిన పైపులు మారుస్తున్నట్లు పేర్కొన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో సుమారు 18 వేల మంది వినియోగదారులు ఉన్నారని, 9 వేల కనెక్షన్లకు మొదటి దశలో పైపులు మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ సిలెండర్ల పంపిణీకి చర్యలు చేపడుతోందని తెలిపారు. దీనికి తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. పైపు మార్పునకు రూ.190 మాత్రమే చెల్లించాలని స్పష్టం చేశారు. దీనికి వినియోగదారులపై ఒత్తిడి చేయడం లేదని చెప్పారు.

ఆధార్ శిబిరం నేటి నుంచి

ఎటపాక, న్యూస్‌టుడే: లక్ష్మీపురం, రాంగోపాలపురం పంచాయతీల పరిధిలోని ప్రజల కోసం లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో సోమవారం నుంచి ఈనెల 26 వరకు ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామాంజనేయప్రసాద్ ఆదివారం తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేరు, పుట్టిన తేదీ, చిరునామా, సెల్ నంబర్ మార్పులకు శిబిరానికి రావాలన్నారు.

అ వీ ఇ వీ


పెదవలస బద్దుమానువీధిలో పథకం ప్రారంభిస్తున్న సర్పంచి, ఉప ఎంపీపీ

తాగునీటి పథకం ప్రారంభం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పెదవలస బద్దుమానువీధిలో తాగునీటి పథకం ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. సర్పంచి కృష్ణవంశీ, వైస్ ఎంపీపీ ఆనందరావు ఆదివారం దీన్ని ప్రారంభించారు. స్థానికంగా జల్‌జీవన్ మిషన్ ద్వారా 5 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి పథకం నిర్మాణం చేపట్టారు. ఈ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. స్థానికులు పలుమార్లు అధికారులు, పాలకులకు విన్నవించడంతో ఈ పనులు పూర్తి చేసి ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేశారు. ఈవోపీఆర్డీ పాపారావు, కార్యదర్శి బాలకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం రేపు

చింతపల్లి గ్రామీణం: ఈనెల 22న చింతపల్లి మండల పరిషత్తు సమావేశ మందిరం వద్ద సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఆశాజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

ఎటపాక, న్యూస్‌టుడే: రాంగోపాలపురం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు లక్ష్మయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు చింతూరు మండలానికి చెందిన జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశారు. మాజీ సర్పంచి వీరస్వామి, ఏడుకొండలు, కణితి మధు, వెంకన్న, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడి

దేవీపట్నం, న్యూస్‌టుడే: నేలకోట సమీపంలోని సారా బట్టీలపై ఆదివారం దాడి చేసి వంద లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని దేవీపట్నం ఎస్సై షరీఫ్ తెలిపారు. 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. డ్రమ్ములను కాల్చివేశారు.

వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు


గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి-గుర్తేడు ప్రధాన రహదారిలో బొదులూరు వద్ద శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. రహదారి పక్కన పడి క్షతగాత్రుడిని స్థానికులు ఆదివారం ఉదయం గమనించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియలేదు. హిందీలో మాట్లాడుతున్నాడని, మతిస్థిమితం లేకుండా ఉన్నాడని స్థానికులు తెలిపారు.

మోదకొండమ్మ సన్నిధిలో నిత్యాన్నదానం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: మన్యం ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ సన్నిధిలో నిత్యాన్నదాన కార్యక్రమానికి కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతానికి ఆదివారం రోజున మాత్రమే ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు కోరారు.




అమ్మవారి సన్నిధిలో అన్నదానం (అంతర చిత్రం) మోదకొండమ్మ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

చోడవరం పట్టణం: స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో ఆదివారం గణపతి హోమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆశ్వీయుజ బహుళ చవితి సంకటహర చతుర్థి సందర్భంగా హోమశాలలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. విఘ్నేశ్వరునికి పంచామృతాభిషేకం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత ఆదివారం ఆత్మీయ సమావేశం అయ్యారు. 1982-83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 80 మంది కుటుంబ సభ్యులతో సమావేశానికి హాజరయ్యారు. విశాఖలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, వెంకటరమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో చెత్త నిర్వహణ కేంద్రంలో పెరిగిన తుప్పలు


రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

సంపద కేంద్రానికి సంకటం!

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టులో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త నిర్వహణ కేంద్రం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఆరేళ్ల క్రితం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో గ్యాస్ గోదాము సమీపంలో పొడి, తడి చెత్తలను వేరు చేసేందుకు ఈ కేంద్రం నిర్మాణం ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ పనులు చేపట్టారు. సిమెంటు స్తంభాలతో షెడ్డు నిర్మించి వదిలేశారు. పైకప్పు రేకులు వేయకుండా తాటికమ్మలు వినియోగించారు. ఏడాదిలోనే వర్షాలకు తాటికమ్మలు పోయి స్తంభాలు మిగిలాయి. ప్రస్తుతం ఈ కేంద్రంలో తుప్పలు పెరిగి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. రూ.లక్షల నిధులు వృథా అయ్యాయే తప్ప ప్రయోజనం చేకూరలేదు.

రోడ్డు పక్కనే చెత్త

ముంచంగిపుట్టు వారపుసంత, ఇతర దుకాణ సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, నివాస గృహాల నుంచి పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను ఈ కేంద్రానికి సమీపంలో రోడ్డు పక్కన పడేస్తున్నారు. దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పరిధిలో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని, డంపింగ్‌యార్డు నిర్వహణకు స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు 15 పశువుల మృతి

కొయ్యూరు, న్యూస్‌టుడే: పిడుగుపాటుకు 15 పశువులు, ఒక మేక మృతి చెందిన ఘటన మఠంభీమవరం పంచాయతీ మందపల్లి గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలో పెద్దపెద్ద శబ్దాలతో పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు కాకూరు మూర్తి, జర్తా బాలరాజు, జర్తా పెంటయ్య, పలాసి చలపతి, జర్తా లక్ష్మయ్య, కాకూరు రాంబాబు, జర్తా సుందర్రావు, రామాంజనేయులు, అర్జున్‌రావులకు చెందిన పశువులు మృతిచెందాయి. ఈ శబ్దానికి గ్రామంలోని వృద్ధురాలు కారూరు బొర్రమ్మ ప్రాణాలు కోల్పోయిందని స్థానికులు తెలిపారు..

మద్దిగరువులో భారీ వర్షం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మద్దిగరువు ప్రాంతంలో పిడుగులతో వాన పడింది. రహదారులన్నీ జలమయమయ్యాయి.


జలమయమైన మద్దిగరువు రహదారి

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

హుకుంపేట, న్యూస్‌టుడే: వైద్యాధికారులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే మత్స్యలింగం పేర్కొన్నారు. స్థానిక ఆసుపత్రిలో ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. వైద్యాధికారులు, సిబ్బంది విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. గిరిజనులు ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకోవాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


హుకుంపేట ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

కుమురం భీం జయంతి రేపు

కూనవరం, న్యూస్‌టుడే: ఆదివాసీ యోధుడు కుమురం భీం జయంతి వేడుకలను మంగళవారం అన్ని గ్రామాల్లోనూ ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ జేఏసీ కార్యదర్శి కుంజా అనిల్ కోరారు. కోతులగుట్టలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల కోసం భీం అనేక పోరాటాలు చేశారన్నారు. ప్రతి పంచాయతీలో పీసా గ్రామసభలు పెట్టాలని ఆదేశాలున్నప్పటికీ అధికారులు పాటించడం లేదన్నారు. సోడే ముత్తయ్య, వేణు, గోపాల్, వినోద్, రాజశేఖర్, అర్జున్, కృష్ణ పాల్గొన్నారు.

పీవో చొరవతో విద్యార్థిని కేజీహెచ్‌కు తరలింపు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఐటీడీఏ పీవో అభిషేక్ చొరవతో అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన విద్యార్థినిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గూడెంకొత్తవీధి మండలం కొడిసింగి గ్రామానికి చెందిన కొర్రా రిబికా.. రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటి వెళ్లి శుక్రవారం సాయంత్రం వసతిగృహానికి వచ్చింది. అదే రోజు రాత్రి విద్యార్థినికి వాంతులు మొదలయ్యాయి. శనివారం, ఆదివారం కూడా వాంతులతో బాధపడింది. హెల్త్ అసిస్టెంట్ మందులిచ్చినా తగ్గలేదు. తీవ్ర జ్వరం రావడంతో ఏఎన్‌ఎం, డిప్యూటీ వార్డెన్ చింతపల్లి ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు విద్యార్థినికి మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షలు చేసి చికిత్స ప్రారంభించారు. బాలిక అప్పటికే అపస్మారక స్థితిలో ఉంది. మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు ఉపాధ్యాయులకు, విద్యార్థిని తల్లి సునీతకు చెప్పారు. వారం రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్తను కేజీహెచ్‌కు తీసుకెళ్లానని, శస్త్రచికిత్స చేసినా ఆయన బతకలేదని, కూతురిని ఎట్టి పరిస్థితుల్లోనూ కేజీహెచ్‌కు తీసుకెళ్లొద్దని సునీత చెప్పింది. తన ఇంటికి తీసుకెళ్లిపోతానని పట్టుబట్టింది. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు ఒప్పించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆమె ఒప్పుకోలేదు. చివరికి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ తల్లి, గ్రామపెద్దలతో ఫోన్‌లో మాట్లాడి కేజీహెచ్‌లో అవసరమైన వైద్యం, ఇతర సదుపాయాలు తానే స్వయంగా చూసుకుంటానని నచ్చజెప్పడంతో అంగీకరించారు. సాయంత్రం ఐదు గంటలకు విద్యార్థినిని అంబులెన్సులో కేజీహెచ్‌కు తరలించారు.


విద్యార్థిని అంబులెన్సులో కేజీహెచ్‌కు తరలిస్తున్న వైద్యసిబ్బంది


ప్రమాదాల నివారణకు చర్యలు

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక పోలీస్‌స్టేషన్ నుంచి కన్నాయిగూడెం వరకు ప్రధాన రహదారిపై గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎటపాక తహసీల్దారు బుబ్బారావు, తెలంగాణ రాష్ట్రం దుమ్ముగూడెం తహసీల్దారు అశోక్‌కుమార్ సమన్వయంతో రహదారికి మరమ్మతులు చేయించారు. స్థానికులు వెంకట్, ఈర్ల కొండయ్య జేసీబీ ఏర్పాటు చేయడంతో ఈ పనులు చేపట్టినట్లు అధికారులు చెప్పారు. ప్రమాదాల నివారణకు సహకరించిన స్థానిక నాయకులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు.


కన్నాయిగూడెం సరిహద్దులో పనులు పరిశీలిస్తున్న అధికారులు

శ్రమదానంతో తుప్పల తొలగింపు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని సున్నంపాడు సర్పంచి వెలుగూరి చినలచ్చిరెడ్డి అన్నారు. పంచాయతీ పరిధిలోని దేవరపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్థులంతా శ్రమదానం చేశారు. ప్రధాన రహదారి వెంబడి ఉన్న తుప్పలను తొలగించారు. వీధుల్లో ఉన్న చెత్తా చెదారాలు తీసి దూరప్రాంతాలకు తరలించారు. పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని సర్పంచి పేర్కొన్నారు.


శ్రమదానంలో గ్రామస్థులు

దుకాణం వద్దనే మద్యపానం

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దుకాణం వద్దనే మందుబాబులు మద్యం తాగుతున్నారు. ప్రధాన రహదారిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుటే ఈ పరిస్థితి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పటికీ స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


అరకులోయలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట మద్యం దుకాణం వద్ద గ్లాసులు

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల సమస్యల పరిష్కారానికి భారతీయ కిసాన్ సంఘ్ కృషి చేస్తోందని సంఘ జిల్లా అధ్యక్షుడు పాంగి వెంకటరమణ అన్నారు. ఆదివారం చింతపల్లి గిరిజన ఉద్యోగ భవనంలో ఆర్‌ఎస్‌ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్ గెమ్మెల మోహన్‌రావు ఆధ్వర్యంలో సంఘ జిల్లా మహాసభ నిర్వహించారు. వివిధ సమస్యలపై పోరాడేందుకు రైతులందరినీ ఒక్కటి చేస్తున్నామన్నారు. రైతులకు సాగులో మెలకువలు నేర్పేందుకు అనేక సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం కిసాన్ సంఘ్ మండల ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కొర్రా సుహాన్‌బాబు, అడపా బాబులునాయుడు, సహాయ కార్యదర్శులుగా నూకరాజు, మిత్ర, కంఠంనాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి శ్రీను, సభ్యులు సత్యనారాయణ, కాగుపతి పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే:

?: మారేడుమిల్లిలోని విద్యాలయాల ప్రాంగణం వద్ద అంతర్రాష్ట్ర రహదారిలో వాహనాల వేగానికి కళ్లెం వేయాలి. విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. – పల్లాల హనుమంతురెడ్డి, మారేడుమిల్లి

✓: ఆయా ప్రాంతాల్లో స్పీడుబ్రేకర్లు నిర్మిస్తాం. – ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, మారేడుమిల్లి



రంపచోడవరం, న్యూస్‌టుడే

?: పందిరిమామిడి కూడలి వద్ద ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – శివాజీ, పందిరిమామిడి కూడలి, రంపచోడవరం

✓: రహదారికి మరమ్మతులు చేయిస్తాం. –ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, రంపచోడవరం

మంత్రి దృష్టికి మండల సమస్యలు

అనంతగిరి, న్యూస్‌టుడే: మండలంలోని పలు సమస్యలను గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లినట్లు జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు తెలిపారు. ఆదివారం సాలూరులోని మంత్రి నివాసంలో ఆమెను కలిసినట్లు చెప్పారు. ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు నాన్‌టీచింగ్ ఉద్యోగాలు కల్పిస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారని, దాన్ని నెరవేర్చాలన్నారు. మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించాలని కోరారు. సోమెల నాగులు పాల్గొన్నారు.


మంత్రితో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు తదితరులు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం


రాజేంద్రపాలెం సంతలో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం మారేడుమిల్లిలో యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కొయ్యూరు: పొలాల్లో విద్యుత్తు తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని కొయ్యూరు సీఐ వెంకటరమణ హెచ్చరించారు. రాజేంద్రపాలెం వారపు సంతకు వచ్చిన గిరిజనులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గంజాయి సాగు, రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. మంప ఎస్సై శంకరరావు పాల్గొన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి వారపు సంతలో ఎస్సై శివకుమార్ ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. అడవి జంతువుల కోసం విద్యుత్తు ఉచ్చులు వేయడం వల్ల మనుషుల ప్రాణాలు పోతున్నాయన్నారు. మెట్టగూడెం అటవీ ప్రాంతంలో కరెంటు ఉచ్చులు వేసిన ముగ్గురిని అరెస్టు చేశామని చెప్పారు.

అనంతగిరి, న్యూస్‌టుడే: యువత గంజాయి జోలికి పోవద్దని ఎస్సై శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. పెదకోట, పినకోట పంచాయతీల్లో జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయితో జీవితాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: వన్యప్రాణులను వేటాడడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని గుర్తేడు ఎస్సై సాయికుమార్ హెచ్చరించారు. టేకులవీధి, జి.వట్టిగడ్డ, గాకలగొంది, మురికలంకలు తదితర గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.


మారేడుమిల్లిలో యువతతో మాట్లాడుతున్న సీఐ గోపాలకృష్ణ